క్లుప్తంగా

నేడు కురుగొండ నుంచి ప్రచారం

ఓజిలి: మండలంలోని కురుగొండ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం మానమాల, బత్తలాపురం గ్రామాల్లో ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు నేదురుమల్లి పర్యటన

వెంకటగిరి రూరల్: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం వెంకటగిరి రూరల్ మండలంలో ప్రచారం చేపట్టనున్నారు. చిన్నన్నపేట, చిన్నవరెడ్డిపల్లి, కళపలపూడి, జీకేపల్లి, కుమ్మరిగుంట యాతలూరు, కె.ఉప్పరపల్లి, ఎండీ కండ్రిగ, వల్లివేడు, బుసపాళెం గ్రామాల్లో ప్రచారం చేయనున్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాల్తి రెడ్డి శ్రీనివాసులురెడ్డి కోరారు.

నేడు మండల సమావేశం

వెంకటగిరి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నీలకంఠేశ్వరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరుకావాలని కోరారు.

కొమ్మిపాడులో ఆరోగ్య సురక్ష

సైదాపురం: మండలంలోని కొమ్మిపాడు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ప్రజలు వివిధ పరీక్షలు చేసి మందులు అందజేశారు.

శ్మశానం రోడ్డు తవ్వేయడంపై ఫిర్యాదు

పెళ్లకూరు: మండలంలోని టెంకాయలతోపు శ్మశానం రోడ్డును తవ్వేయడంపై శుక్రవారం గ్రామస్తులు తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎస్‌ఐ శ్రీకాంత్‌తోపాటు మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. శ్మశానానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో గతంలో అనేక ఇబ్బందులు పడేవారు. గతంలో గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం మేరకు అదే ప్రాంతానికి చెందిన దువ్వూరు నగేష్‌రెడ్డి, నీలం కమలాకర్ దాతృత్వంతో వ్యవసాయ భూముల మీదుగా శ్మశానం వరకు రోడ్డు వేశారు. ఇప్పుడు ఆ రోడ్డును కమలాకర్ తవ్వేశాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సిద్ధలయ్య కోనలో సర్వే

సైదాపురం: మండలంలోని సిద్ధలయ్యకోన వద్ద జరుగుతున్న మైనింగ్ పనులను శుక్రవారం జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్, స్థానిక రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేపట్టారు. మైనింగ్ పనులపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు భూమిని సర్వే చేస్తున్నట్టు మైనింగ్ అధికారులు తెలిపారు. సమగ్రంగా సర్వే చేసి హైకోర్టుకు నివేదిక పంపుతామన్నారు.

పోలీసుల కవాతు

కోట: మండలంలోని కొత్తపట్నం, గోవిందపల్లి, సిద్ధవరం, కర్లపూడిలో శుక్రవారం కేంద్ర సాయుధ దళాలు, పోలీసులు కవాతు చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని వాకాడు సీఐ హరిక్రిష్ణ, ఎస్‌ఐ నాగబాబు కోరారు.

గర్భిణులకు పౌష్టికాహారం

గూడూరు రూరల్: గూడూరు పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ఉన్న మాతా శిశుసంరక్షణ కేంద్రంలో గర్భిణులకు శుక్రవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. పట్టణానికి చెందిన డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రతి నెలా జన విజ్ఞాన వేదిక ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఆస్పత్రి వైద్యులు రాజా పాల్గొన్నారు.

ఆనం వల్లే ఆగిన ఆల్తూరుపాడు రిజర్వాయర్

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపణ

డక్కిలి: ఆనం రామనారాయణరెడ్డి తన సొంత ప్రయోజనాల కోసం టీడీపీతో కుమ్మక్కై ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను నిలిపి వేయించారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం దగ్గవోలు, కేబీపల్లి, పాతనాలపాడు, చాకలపల్లి, నాయుడుపాళెం, లింగసముద్రం, సంగనపల్లి గ్రామాల్లో ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల తాగునీటి, సాగునీటి కోసం రూ.400 కోట్లతో ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. దీని సామర్థ్యం ఒక టీఎంసీ అని తెలిపారు. రిజర్వాయర్ పూర్తయితే జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి టీడీపీతో కుమ్మక్కై అడ్డు పడుతూ వచ్చారని తెలిపారు. కమీషన్లు ఇవ్వాలని కాంట్రాక్టర్లను వేధించి పనులు జరగకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఏడాదిలో రూ.53 కోట్ల పనులు మంజూరుకాగా రూ.45 కోట్ల పనులు చేపట్టామన్నారు.

చంద్రబాబువన్నీ అబద్ధాలే

14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగనన్నను ఎదుర్కోలేక జనసేన, బీజేపీతో


పాతనాలపాడులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

జట కట్టాడని, గతంలో బీజేపీని, నరేంద్రమోదీని తిట్టడంతో పాటు తిరుపతిలో అమిత్‌షాపై రాళ్లు వేయించారని గుర్తు చేశారు. ఇప్పుడు బీజేపీ నాయకుల సంక నాకుతున్నారని విమర్శించారు. చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలను ఎవ్వరూ నమ్మ వద్దన్నారు. ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో సీఎం జగనన్న ఆశీస్సులతో ఎన్నికల బరిలో దిగానని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే సేవకుడిలా సేవ చేస్తానన్నారు. అంతకుముందు ఆయనకు గ్రామాల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు కె.ధనుంజయ్యరెడ్డి, ఎంపీపీ జీ రాజశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పీ జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ పరశురామయ్య, టీ శంకర్‌రెడ్డి, మస్తాన్‌నాయుడు, జీ శ్రీనివాసులునాయుడు, కే కవిత, అరుణాచలం, మాధవ్ నాయుడు, సుధాకర్, శ్రీనివాసులు, పరంధామయ్య, గోవర్ధన్‌నాయుడు, ఆర్ చిరంజీవి, శ్రీనివాసులురెడ్డి, వెంకటస్వామి, జానకిరాం, మీరయ్య, సునీల్, పీ గోపాల్, లక్ష్మీనారాయణ, ఎం నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ చెంచయ్య, డీ రవీంద్రారెడ్డి, బీ కృష్ణ, డీపీ యాదవ్, పీ దశరథరామిరెడ్డి, మల్లిరెడ్డి, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, వీ చెంచయ్య, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్యులకు సముచిత స్థానం

గూడూరురూరల్: ఆర్య వైశ్యులకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానం కల్పిస్తుందని తిరుపతి ఎంపీ గురుమూర్తి, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ తెలిపారు. వారు శుక్రవారం వాయిగండ్ల నాగరాజు ఆధ్వర్యంలో గూడూరులోని జీఎస్ రాయులు కల్యాణ మండపంలో ఆర్య వైశ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలో ఉన్న ఆర్య వైశ్యులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఆర్య వైశ్యులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. తిరుపతి పార్లమెంటు పరిధిలోని ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. గూడూరు నియోజకవర్గంలో మేరిగ మురళీధర్, తిరుపతి పార్లమెంటుకు తనకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిచాలని కోరారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు నేడు రాజకీయాల్లోనూ రాణిస్తున్నారని తెలిపారు. గూడూరులో తాను నిరంతరం అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీతఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, నాశిన నాగులు, ఏఎంసీ మాజీ చైర్మన్ బాబురెడ్డి, వాయిగండ్ల సుధాకర్, వల్లంకొండ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

మీ ఇంటి బిడ్డ మేరిగను గెలిపించండి

గూడూరు రూరల్: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేస్తున్న మీ ఇంటి బిడ్డ మేరిగ మురళీధర్‌ను గెలిపించాలని ఆయన తనయుడు డాక్టర్ రేవంత్ చక్రవర్తి కోరారు. ఆయన శుక్రవారం గూడూరు పట్టణంలోని 12వ వార్డులో ఉన్న నారాయణమ్మవీధి, జాండ్రవీధి, కుమ్మరవీధిలో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వలంటీర్, సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించినట్టు తెలిపారు. 2019 ఎన్నికల్లో మేనిఫెస్టోలో చెప్పిన హామీలను అన్నింటినీ నెరవేర్చినట్టు తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిరుపతి ఎంపీ, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, మేరిగ మురళీధర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్లు జమ్మళ్ల సుకన్య, తాళ్లూరు శ్రీనివాసులు, క్రిష్ణప్రసాద్‌రెడ్డి, షంషీర్, దాసరి వెంకటేశ్వర్లు, నాయకులు బట్టా గోపీయాదవ్, జమ్మళ్ల వాసు, అన్నంమురళి, రాఘవరెడ్డి, ఆల్తాఫ్, అజీజ్‌ఖాన్, బిక్కు సాహెబ్, శ్రీధర్‌రెడ్డి, కోదండరామయ్య, పూర్ణచంద్ర తదితరులు పాల్గొన్నారు.


నారాయణమ్మ వీధిలో ప్రచారం చేస్తున్న రేవంత్ చక్రవర్తి

ఆనం.. నీచ రాజకీయాలు మానుకో

రాపూరు: వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి నీచ రాజకీయాలు మానుకోవాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాపూరులోని ప్రభుత్వ కార్యాలయాలను తరలించడానికి కారణమెవరో ప్రజలకు తెలుసన్నారు. ఆర్టీసీ డిపో నిర్వీర్యం కావడానికి ఆనమే కారణమని పేర్కొన్నారు. కమీషన్ల కోసం ఎస్ఎస్ కెనాల్, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను అడ్డుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే టీ డీపీతో కుమ్మక్కై అభివృద్ధిని అడ్డుకున్న నీచ సంస్కృతి ఆనం రామనారాయణరెడ్డిదని దుయ్యబట్టారు. 14వ తేదీన ఆనం రామనారాయణరెడ్డి కుట్రతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, గంగాప్రసాద్ వద్ద ప్యాకేజీ తీసుకుని రాపూరు మండల ప్రజల జీవితాలతో ఆడుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు కోటేశ్వరరెడ్డి, మధురెడ్డి, బుజ్జిరెడ్డి, పెంచలస్వామి, ఆరీఫా బేగం, గని, కలపాటి మధుసూదన్‌రెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

రాపూరు: కోటూరుపాడు రైల్వే బ్రిడ్జి వద్ద రైలు కింద పడి రాపూరుకు చెందిన వెంకటయ్య(60) మృతి చెందిన ఘటన శుక్రవారం స్థానికంగా విషాదాన్ని నింపింది. కృష్ణపట్నం నుంచి ఓబులవారిపల్లికి వెళుతున్న గూడ్స్ రైలు కింద పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.



నేడు విద్యుత్‌కు అంతరాయం

నాయుడుపేట టౌన్: నాయుడుపేట డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి, పెళ్లకూరు, ఓజిలి, దొరవారిసత్రం, బాలయపల్లి, డక్కిలి మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఈఈ ప్రసన్నకుమార్ తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ ఉండదన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్: గూడూరులోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల వల్ల శనివారం గూడూరు, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈ ప్రసాద్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

దొరవారిసత్రం: కొత్తపల్లి గ్రామ పరిధిలో సాగులో ఉన్న జీ–24 రకం వేరుశనగ పంటను శుక్రవారం సూళ్లూరుపేట వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ ఏడీఏ అనిత, స్థానిక వ్యవసాధికారిణి జ్యోతిర్మయి పరిశీలించారు. జీ–24 రకం(గుజరాత్ రకం) 125 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. గతంలో ఎకరాకు 60–70 బస్తాల దిగుబడి వచ్చినట్లు పేర్కొన్నారు. రూ.90 వేలు నుంచి రూ.లక్ష వరకు లాభం పొందినట్లు తెలిపారు. ఈ రకం వంగడాలను ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తే బాగుటుందని అధికారులకు విన్నవించారు. ప్రస్తుతం కొత్తపల్లిలో పలువురు రైతుల వద్ద జీ–24 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ తెలిపారు.

ఆక్రమణ భూమి స్వాధీనం

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామం స్వర్ణముఖి నదీ తీరాన ఉన్న ఆక్రమణ భూమిని స్థానిక రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సర్వే నంబరు 74/3లో 11 సెంట్లు, 74/22లో 5 సెంట్లు, 74/21లో 3 సెంట్లు మొత్తం 19 సెంట్ల భూమిని నాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకుడు ఆక్రమించుకుని తన వెంచర్‌కు రోడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినా సదరు నాయకుడు బోర్డులను తొలగించాడు. ఈ క్రమంలో యంత్రాలతో గాడి తీయించి భూమిని స్వాధీనం చేసుకునేలా తహసీల్దార్ ప్రసాద్‌రావు చర్యలు చేపట్టారు.

వైభవంగా రథోత్సవం

కోట: గూడలిలో కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రథోత్సవం కనుల పండువగా చేపట్టారు. కామాక్షీదేవి, సంగమేశ్వరుని ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ భక్తులు రథాన్ని లాగారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి తిన్నెలపూడికి చెందిన నిరంజన్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. శనివారం స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

వాకాడు: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం నిడిగుర్తి, రావిగుంటపాళెం, పూడిరాయిదొరువు, మూలపడవలో పర్యటించారు. నిడిగుర్తిలో నాయకులు, కార్యకకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న చేసిన అభివృద్ధి పనులు, అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో వలంటీర్ల ద్వారా చేసిన సేవలు, అందించిన వైద్య సేవల గురించి తెలియజేయాలని సూచించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందించిన ప్రభుత్వాన్ని ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. మండలంలో గతంలోకంటే అధికంగా మెజారిటీ వచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, దువ్వూరు భాస్కర్‌రెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్ రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధురెడ్డి, బూదనం వెంకటరత్నం, సుబ్బారెడ్డి, వాకాటి రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

వెంకటగిరి రూరల్: వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు వెంకటగిరి పట్టణంలో ప్రచారం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 1వవార్డులోని బంగారుపేటలో శుక్రవారం కౌన్సిలర్ పేర్నేటి సుబ్బారావు, 7వ వార్డులోని కౌన్సిలర్ మాడా జానకిరామయ్య, 19వ వార్డులో కౌన్సిలర్ వహిద, 8వ వార్డులో కౌన్సిలర్, వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. మంచిని గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీగా గురుమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యస్దానీ బాషా, నేతలు రాయపాటి శివకుమార్, మేకల శ్రీనివాసులు, మేకల పెద్ద వెంకటయ్య, లోకనాథం, సాయి, గౌరి, హరి, నాగరాజు, వెంకటేష్, కృష్ణయ్య, పెంచలయ్య, పండు, కలపాటి ప్రసాద్, చింతగింజల పరమేశ్వరయ్య, మల్లీశ్వరి, గోపమ్మ, సిద్ధమ్మ, విజయమ్మ, శివ, పార్వతమ్మ, సుబ్బమ్మ పాల్గొన్నారు.


బంగారుపేటలో ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ సుబ్బారావు తదితరులు

పేదల ప్రభుత్వాన్ని ఆదరించండి

కలువాయి: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని జెడ్పీటీసీ అనీల్‌కుమార్ రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం దాచూరు మజరా కమ్మపాళెంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. గతంలో చంద్రబాబునాయుడు హామీలు ఇచ్చి చేసిన మోసాన్ని వివరించారు. కరోనా కష్టకాలంలోనూ జగనన్న ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని మరువలేదని గుర్తుచేశారు. చేసిన మంచిని గుర్తుపెట్టుకుని ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తిరుపతి ఎంపీగా గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యేగా నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీ వేధింపులతో 87 మంది వలంటీర్ల రాజీనామా


రాపూరులో రాజీనామా చేసిన వలంటీర్లు


కలువాయి : ఎంపీడీవో ప్రభాకర్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

రాపూరు: మండలంలోని పలు సచివాలయాలకు చెందిన 87 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన నాయకులు తమపై చేస్తున్న వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా చేసినట్టు తెలిపారు. ఎన్నికల్లో ప్రతిగడపకూ వెళ్లి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన సేవలను వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసేలా చూస్తామని తెలిపారు.

కలువాయిలో 27 మంది..

కలువాయి: మండలంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 27 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీవో ప్రభాకర్‌కు అందజేశారు. వలంటీర్ల సంఘం నాయకుడు రామయ్య మాట్లాడుతూ ప్రతిపక్షాలు తమపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

చిల్లకూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు వేసుకునేలా పోలింగ్ కేంద్రాల వారిగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నోడల్ అధికారి కాంచన తెలిపారు. ఆమె శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని పోలింగ్ కేంద్రాల వారిగా బీఎల్వోలు ఓటర్లకు అవగాహన కల్పించేందుకు సోమవారం నుంచి వారం రోజులు అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినయోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో జోనల్ అధికారులు భానుమూర్తి, బీవీ క్రిష్ణయ్య, మునిరత్నం, ఏఎస్‌వో బాషా, ఆర్‌ఐ రమ్యస్వాతి పాల్గొన్నారు.

చేపల సొసైటీపై పర్యవేక్షణకు పదిమంది సభ్యులు

చిల్లకూరు: మండలంలోని ముత్యాలపాడు గ్రామ పెద్ద చెరువుకు సంబంధించిన ఎస్సీ మత్స్యకార సొసైటీ పర్యవేక్షణకు పది మంది సభ్యులను ఎంపిక చేసినట్టు సొసైటీ అధ్యక్షుడు పామంజి రాఘవులు తెలిపారు. ముత్యాలపాడు చెరువు వద్ద శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ మత్స్యకార సొసైటీ ఆధ్వర్యంలో అనేక ఏళ్లుగా ముత్యాలపాడు చెరువులో చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గత ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ ఇచ్చిన క్రమంలో లక్ష వరకు చేప పిల్లలు వదులుకున్నామని తెలిపారు. నీరు తగ్గిన తరువాత వాటిని పట్టుకోవాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. గ్రామంలోని కొంతమంది తమ సొసైటీలో వివాదాలు సృష్టించి సభ్యుల్లో అలజడి రేపుతున్నారని తెలిపారు. దీనివల్ల సొసైటీ సభ్యులలో మనస్పర్థలు రాకుండా ఉండేలా పది మంది కమిటీ సభ్యులను ఎంపిక చేసి వారి ద్వారా చెరువుపై పూర్తి పర్యవేక్షణ చేపట్టేలా తీర్మానం చేసినట్టు తెలిపారు. మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చినట్టు వివరించారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ

కోట బీసీ గురుకుల పాఠశాలలో..


సాయిక్రిష్ణ

కోట: ఇంటర్ ఫలితాల్లో కోటలోని బీసీ గురుకుల జూనియర్ కళాశాల జూనియర్ ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణులయ్యారు. సి.మోహన్‌బాబు 470కి 462 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. సెకండియర్‌లో 77 మంది పాసైనట్లు తెలిపారు. ఎంపీసీలో ఆర్.సాయిక్రిష్ణ 987 మార్కులు సాధించాడు. ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్‌లో 62 మంది, సీనియర్ ఇంటర్‌లో 58 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో 72 మంది, సెకండియర్‌లో 85 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రామక్రిష్ణారెడ్డి తెలిపారు.

వెంకటగిరిలో..


దామిని పద్మావతి, దవనిక, స్వప్న, పోతన్

వెంకటగిరి రూరల్: ఏపీ మోడల్ కళాశాలలో 91 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు ప్రిన్సిపాల్ తులసి జ్యోతి తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 44 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఎంపీసీలో డి.పోతన్ 960, బైపీసీలో సీహెచ్ స్వప్న 953 మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్ దవనిక 454, బైపీసీలో ఎస్ దామిని పద్మావతి 419 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

దొరవారిసత్రం కేజీబీవీలో..


నాని, లహరి, లోకేష్, బ్రహ్మనందం


నాగప్రవీణ్

దొరవారిసత్రం: ఇంటర్ మొదటి సంవత్సరంలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి ప్రవీణ్ (ఎంపీసీ) 462, లోకేష్(బైపీసీ) 429, ఉమామహేష్(సీఈసీ) 465 మార్కులు సాధించారు. సెకండియర్‌లో బ్రహ్మానందం(ఎంపీసీ) 966, విష్ణు(బైపీసీ) 957, వెంకయ్య(సీఈసీ) 866 మార్కులు సాధించారు. కేజీబీవీకి చెందిన లహరి జూనియర్ ఇంటర్‌లో 485, సీనియర్ ఇంటర్‌కు చెందిన నాని 913 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో మావిళ్లపాడు ఆదర్శ పాఠశాలకు చెందిన లోకేష్(ఎంపీసీ) 864, పవనశ్రీ (బైపీసీ) 876, చందు(సీఈసీ) 672 మార్కులు సాధించారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట: ఇంటర్ ఫలితాల్లో స్థానిక బీఆర్ అంబేడ్కర్ పుదూరు బాలికల గురుకుల విద్యాలయ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ రూత్ రమేలా తెలిపారు. సీనియర్ బైపీసీలో 92.1 శాతం, జూనియర్ బైపీసీలో 90 శాతం, సీనియర్ ఎంపీసీలో 93.3 శాతం, జూనియర్ ఎంపీసీలో 79.4 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. సీనియర్ ఎంపీసీ విద్యార్థి స్పందన 878, డి.తరణి 875, సీనియర్ బైపీసీలో జి.తేజశ్విని 931, ఎస్ రేష్మా 924 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు.

రాపూరులో..


నందిని, ప్రత్యూష, సాయిదీపిక, పార్వతి

రాపూరు: ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో ఎం.నందిత 933, ప్రత్యూష 877 మార్కులు, మొదటి సంవత్సరంలో సతీష్ 315 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నాయక్ తెలిపారు. కండలేరు గురుకులంలో సీనియర్ ఇంటర్‌లో 84 మందిలో 64 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో జి.సాయిదీపిక 879 మార్కులు, ఎంఈసీలో పార్వతి 753 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 67 మందిలో 54 మంది ఉత్తీర్ణులవగా, మొదటి సంవత్సరం ఎంఈసీలో మేరి 440, సీఈసీలో వర్షిణి 413 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ భారతి తెలిపారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: ఇంటర్ ఫలితాల్లో చిల్లకూరులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు 55 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మీరా సాహెబ్ తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో జి.కిరణ్‌కుమార్ (ఎంపీసీ) 922, బైపీసీలో ఏ చందు 809 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో చిగురుపాటి శ్రీనాథ్ (ఎంపీసీ) 434, వై సంపత్(బైపీసీ) 320 మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. వారిని ఆమె అభినందించారు.

కలువాయిలో..

కలువాయి: ఇంటర్ ఫలితాల్లో కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్ టూ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో మలిశెట్టి కీర్తన 922, బైపీసీలో చీర్ల చందన 836 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో షేక్ గౌసియా 366 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ అబ్బాస్ అలీ తెలిపారు. కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎంపీసీలో ఎం.జేష్ణవి 938, మొదటి సంవత్సరం ఎంపీసీలో లక్ష్మీమేఘన 457 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ షేక్ మహబూబ్‌బాషా తెలిపారు.

గూడూరులో..

గూడూరు రూరల్: ఇంటర్‌లో ఎస్‌కేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో ఎం.పావని(ఎంపీసీ) 916, బి.భానుశ్రీ (బైపీసీ) 760, ఆర్.శ్రీనివాసులు(సీఈసీ) 896, జి.చందు(హెచ్‌ఈసీ) 712 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో ఇ.శ్రీనివాసులు(ఎంపీసీ) 384, టి.శిరీష (సీఈసీ) 403, ఒకేషనల్‌లో ప్రథమ సంవత్సరంలో పి.హేమసాయి 335, వై రాజేష్ 387, బి.బేబీ సౌమ్య 446, రెండో సంవత్సరంలో పి.గురుసాయి 905, ఎస్‌కే షాహుల్ 779, కె.అనేష్ 902 మార్కులు సాధించారు. అలాగే స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ఎస్.సాలేహా (ఎంపీసీ) 973, వై.అశ్విత (ఎంపీసీ) 972, బైపీసీలో బి.సుష్మశ్రీ 968, జి.హర్షిత 933, ఎస్.భార్గవి 929 మార్కులు సాధించారని తెలిపారు.

సత్తా చాటిన టీఎంఆర్ విద్యార్థులు


టి.లిఖిత, పి.సంధ్య, సీహెచ్ కార్తీక్, ఇ.నాని

చిట్టమూరు(చిల్లకూరు): ఇంటర్ ఫలితాల్లో టీఎంఆర్ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రహమతుల్లా తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో పి.లిఖిత 966, కె.కీర్తి 964, ఎస్.చందన 958 మార్కులు సాధించి మండలంలో వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. అలాగే సీనియర్ ఇంటర్ బైపీసీలో పి.సంధ్య 882, కె.సీలిమ 865 మార్కులు సాధించి మొదటి, రెండో స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. సీఈసీలో కార్తీక్ 927, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో ఇ.నాని 451, రాకేష్ 450, బైపీసీలో వి.చండేశ్వరి 402, సీఈసీలో గాయత్రి 411 మార్కులు సాధించినట్టు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 95 శాతం, జూనియర్ ఇంటర్‌లో 92 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు పేర్కొన్నారు.

కందనూరు బాపూజీ సేవలు చిరస్మరణీయం


స్వర్గధామం వద్ద వాహనాన్ని ప్రారంభిస్తున్న కలికి మాధవ రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్: విశ్రాంతి వ్యాయమ ఉపాధ్యాయులు, హిందూ ధర్మ సంఘం సభ్యుడు దివంగత కందనూరు బాపూజీ సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం అధ్యక్షుడు కలికి మాధవ రెడ్డి కొనియాడారు. పట్టణంలోని స్వర్ణ ముఖి నది ఒడ్డున ఉన్న స్వర్గధామం కార్యాలయం వద్ద శుక్రవారం బాపూజీ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం దాతల సహకారంతో నిర్మించిన భవనాలు, వాహనాన్ని హిందూ ధర్మ సేవా సంఘం అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి ప్రారంభించారు.కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా రూరల్ అధ్యక్షుడు కనమర్లపూడి సుబ్రమణి, కామిరెడ్డి అమరేందర్ రెడ్డి, చదలవాడ కుమార్, కందనూరు సంజయ్‌కుమార్, సుబ్రమణ్యం యాదవ్, ఆకుల కుబేరు మణి, గంధవళ్లి సిద్దయ్య, చిగురువాడ పద్మనాభం, విశ్రాంతి అధ్యాపకులు పేర్నాటి వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెసల గంగాప్రసాద్ పాల్గొన్నారు.


శ్రీ స్థంభాల గిరి ఈశ్వరయ్య స్వామి వారి దేవస్థానము
దేవునివెల్లంపల్లి గ్రామము, డక్కిలి మండలం, తిరుపతి జిల్లా.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన (5వ సారి)

పై దేవస్థానమునకు హక్కుభుక్తమైన ఈ క్రింద వివరించిన హక్కులను 2024-25 ఆర్థిక సం॥నకు లీజుకు అనుభవించుటకు గాను తేది.20.04.2024 శనివారం మధ్యాహ్నం గం. 2.00లకు దేవదాయ శాఖ అధికారులు, గ్రామ పెద్దల సమక్షములో దేవస్థాన కార్యనిర్వహణాధికారిచే సీల్డు టెండర్లు, బహిరంగవేలం పాటలు జరుపబడును.

క్ర.సం.	వేలంపాట వివరములు	ధరావత్తు రూ.	కాలపరిమితి
1	తలనీలాలు సేకరించుకొను హక్కు	3,00,000/-	తేది.28.04.2024 నుండి 2025 సం॥ తిరునాళ్ళ ముందురోజు వరకు
2	చెప్పులస్టాండు నిర్వహించుకొను హక్కు	2,000/-	తేది.28.04.2024 నుండి తేది.27.05.2024 వరకు

వరుస నెం.1 నుండి 2 వరకు గల బహుమతికి సీల్డు టెండరు/ బహిరంగ వేలములో లభించిన హెచ్చు మొత్తమునకు ఖరారు చేయబడును. టెండరు షెడ్యూలు రూ.200/-లు చెల్లించి తేది.20.04.2024 మధ్యాహ్నం గం॥ 12.00ల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు షెడ్యూలు తేది. 20.04.2024 మధ్యాహ్నం గం॥2.00ల లోపు దాఖలు చేయవలెను. ఇతర వివరములు కార్యాలయ పనివేళలలో / వేలంపాట సమయములో అడిగి తెలుసుకొనవచ్చును. సం/- కార్యనిర్వహణాధికారి